ప్రజాశక్తి
సోమవారం 1 జనవరి 2024
5
శ్రీకాకుళం



3న సిక్కోలు డ్వాక్రా బజారు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల మూడో తేదీన సిక్కోలు డ్వాక్రా బజారును ప్రారంభిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డి.వి విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏడు రోడ్ల కూడలి వద్ద గల నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల మైదానంలో ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే డ్వాక్ర బజారు తొమ్మిదో తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం పది నుంచి రాత్రి 9.30 గంటల వరకు తెరిచి ఉంటుందని పేర్కొన్నారు. ఈ బజారులో స్వయం సహాయక బృందాలు తయారు చేసిన పలు వస్తువులను ప్రదర్శించడంతో పాటు విక్రయించనున్నట్లు తెలిపారు.

అంగన్వాడీల ఆటాపాటా

20వ రోజుకు చేరిన సమ్మె

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఉధృతమవుతోంది. ఆదివారానికి సమ్మె 20వ రోజుకు చేరుకోగా, సమ్మెలో భాగంగా ఆటపాటలు ఇతర రూపాల్లో నిరసనలు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని పెద్దపెట్టున నినాదాలతో హోరెత్తించారు. శ్రీకాకుళం నగరం, ఎచ్చెర్లలో సమ్మె శిబిరాల్లో కోలాటమాడుతూ ఆటాపాటా కార్యక్రమం నిర్వహించారు. సమ్మె శిబిరాలను సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి సందర్శించి మద్దతు తెలిపారు. అక్కాచెల్లెమ్మలపై తనకు ఎంతో ప్రేమ ఉందని చెప్పుకునే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీలపై అనుసరిస్తున్న వైఖరితో నిజస్వరూపం బయటపడిందని అన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక కేవలం రూ.వెయ్యి వేతనం మాత్రమే పెంచిందన్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగినా నాలుగేళ్లుగా అంగన్వాడీల వేతనాలు పెంచకపోవడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి , నాయకులు రాజేశ్వరి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు. కోటబొమ్మాళి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆటాపాటా చేపట్టి నిరసన తెలిపారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి రాక్షస పాలనకు రోజులు దగ్గర పడ్డాయని విమర్శించారు.

పలాసలో కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా సిఐటియు జెండాలను చేతపట్టి చిన్నారులు సమ్మె శిబిరంలో కూర్చొన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.మంజుల, బి.సునీత, కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో బస్టాండ్ కూడలి వద్ద సమ్మె శిబిరంలో చేతులెత్తి మొక్కుతూ నిరసన తెలిపారు. మా డిమాండ్లు నెరవేర్చండి మహాప్రభో అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు హైమ, జయలక్ష్మి, బాలమణి తదితరులు పాల్గొన్నారు. పొందూరులో తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో యూనియన్ నాయకులు జ్యోతిలక్ష్మి, నాగరత్నం, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. కొత్తూరులో సమ్మె శిబిరంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిర్ల ప్రసాద్, అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.లక్ష్మి, జలజాక్షి, హేమలత తదితరులు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : ఆటాపాటతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



శ్రీకాకుళం అర్బన్ : కోలాటం ఆడుతున్న అంగన్వాడీలు



ఇచ్ఛాపురం : చేతులు ఎత్తి మొక్కుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

నూతన సంవత్సర సైకత స్వాగతం



నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మండలంలోని గాజుల కొల్లివలసకు చెందిన సైకతశిల్పి గేదెల హరికృష్ణ సంగమేశ్వర స్వామి కొండ దిగువన వేసిన సైకత శిల్పం పలువురిని ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి హరికృష్ణను అభినందించారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస



2023 నుంచి 2024లోకి అడుగుపెట్టాం
హ్యాపీ న్యూ ఇయర్ అని ఒకరికొకరు చెప్పుకుంటాం
మిఠాయిలు పంచుకుని ఆనందిస్తాం
మళ్లీ ఆ పాత అలవాట్లు, ఆ పాత పనులు, అదే దినచర్య...
కేవలం ఒక అంకె మార్పు వల్ల 'హ్యాపీ' వచ్చేయదు కదా!

ఒక నూతన లక్ష్యం ఏర్పరుచుకోవాలి
ఆ లక్ష్యం సాధించేందుకు ఆచరణసాధ్యమైన ప్రణాళిక వేసుకోవాలి
ఆ ప్రణాళికను అమలు చేసేందుకు పట్టుదలగా ప్రయత్నించాలి
ఓర్పు, సహనంతో పాటు పట్టువిడుపూ ప్రదర్శించాలి
ఎప్పటికప్పుడు పురోగతిని బేరీజు వేసుకుంటూ ముందుకు పోవాలి
వంద పనులున్నా... అందులో 99 పనులు పక్కనపెట్టి కేవలం లక్ష్యసాధన పైనే గురిపెట్టగలగాలి

ఇక ఎలాంటి కష్టమైనా, లక్ష్యమైనా తప్పక చేరుకుంటాం
అప్పుడు ఇక రోజూ హ్యాపీయే కదా
జీవితమే కొత్త సంతోషాలతో నిండిపోతుంది
అది కదా హ్యాపీ న్యూ ఇయర్!

ఇక ఎందుకు ఆలస్యం?
ఒక మంచి ఆచరణ సాధ్యమైన
లక్ష్యం ఏర్పరుచుకోండి... దూసుకుపోండి

- వి.జి.కె మూర్తి

ప్రజాశక్తి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఎచ్చెర్ల మండలం నవభారత్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ లోని ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ కార్యాలయంలో ఆదివారం రాత్రి వేడుకలు నిర్వహించారు. ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు కేకును కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో వ్యక్తిగత అభివృద్ధితో పాటు, సంస్థ పురోగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ కన్వీనర్ ఎ.సోమశేఖరరావు, డెస్క్ ఇన్‌ఛార్జి జి.లక్ష్మణరావు, ఎడివిటి ఇన్‌ఛార్జి టి.బుజ్జిబాబు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న మేనేజర్ కామినాయుడు

కొత్త సంవత్సర కానుక

- పింఛన్ ఇక రూ.మూడు వేలు
- ఈనెల నుంచి రూ.250 పెంపు
- జిల్లాలో 3,30,430 మందికి లబ్ధి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైఎస్సార్ పింఛను కానుక పథకం కింద ప్రభుత్వం ఈనెల నుంచి రూ.మూడు వేలు అందించనుంది. సామాజిక భద్రత పింఛన్ల కింద ప్రభుత్వం నెలకు రూ.2,750 అందిస్తోంది. ఇటీవల ఆ మొత్తానికి మరో రూ.250 కలిపి అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. 2019 జూన్ వరకు నెలకు రూ.రెండు వేల పింఛన్ ప్రభుత్వం అందిస్తూ వస్తోంది. 2019 జులై నుంచి రూ.250 పెంచి రూ.2,250 కి పెంచిన ప్రభుత్వం దశల వారీగా రూ.మూడు వేలకు పెంచింది. ఈనెల మూడు నుంచి ఎనిమిదో తేదీ వరకు జిల్లాలో పింఛన్లు అందించనున్నారు. సామాజిక భద్రత కింద జిల్లాలో 16 రకాల పింఛన్లు అందిస్తుండగా, పెంచిన ఫించన్‌ను ఏడు కేటగిరీలకు వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చెప్పులు కుట్టేవారు, ఒంటరి మహిళలకు పింఛన్ పెరగనుంది. జిల్లాలో మొత్తం 3,30,430 మందికి పెంపు ప్రయోజనం కలగనుంది.



కొత్తగా 9,650 పింఛన్లు మంజూరు

జిల్లాకు కొత్తగా 9,650 పింఛన్లు మంజూరయ్యాయి. గత నెల 3,20,780 మందికి రూ.93.74 కోట్ల పింఛన్లు అందించగా, కొత్తగా మంజూరైన పింఛన్లతో కలిపి మొత్తం పింఛన్లు 3,30,430కి చేరింది. వీరికి రూ.99.12 కోట్లను అందించనున్నారు. దీనివల్ల జిల్లాలో రూ.5.38 కోట్ల భారం పడనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పెంచిన పింఛన్లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని అమరావతి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల మూడో తేదీన ప్రారంభించనున్నారు.

ప్రముఖుల నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, ఆమదాలవలస

జిల్లా ప్రజలకు పలువురు ప్రముఖులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024లో ప్రజలందరికీ మంచి జరగాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆకాక్షించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు మరింత సహకారం అందించి ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెంది రాష్ట్రం ప్రగతిబాటలో పయనించేందుకు దోహదపడాలన్నారు. జిల్లా ప్రజలకు భోగభాగ్యాలు, శుభాలు, సంతోషాలు, ఆనందాలు నింపే సంవత్సరం కావాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆకాక్షించారు. కరోనా నాలుగో దశ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తం ఉంటూ, కరోనా మహమ్మారిని శాశ్వతంగా తరిమికొట్టే వరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు నూతన సంవత్సరం సరికొత్త ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని, ఆనందాన్ని సమకూర్చాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆకాక్షించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలతో పాటు నవరత్నాల అమలుతో ఈ ఏడాదీ పేదల కళ్ళల్లో ఆనందాన్ని, సంతోషాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందించనున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. 2024 మంచి ఆరోగ్యాన్ని, క్షేమాన్ని అందించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. నూతన ఉత్తేజాన్ని కలిగిస్తూ ప్రతి కుటుంబం ఆర్థికంగా ప్రగతిపథంలో సాగాలని పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని, నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా చేసుకోవాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



నగరాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు మౌలిక వసతులు సమకూర్చి రాష్ట్రంలోని ఇతర నగరాలతో సమానంగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. నగరంలోని పుప్పాలవారి వీధి, తుమ్మావీధి, దండివీధిలో నిర్మించిన సిసి రోడ్లను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూ కాలనీలో రూ.1.58 కోట్లతో బి.టి రోడ్డును మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో రోడ్ల విస్తరణ చేపట్టడం వల్ల అనేక వ్యాపార సంస్థలు ఇప్పుడు జిల్లావాసులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిగిలిన పనులకు సంబంధించి టెండర్స్ పిలిచి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 20 ఏళ్ల కిందట పట్టణానికి సంబంధించి ఏర్పాటు చేసిన గార్బేజీ యార్డు నిండుకుందని, అక్కడ రూ.19 కోట్లతో చెత్తను తొలగించే పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

మాట తప్పి మడమ తిప్పిన జగన్

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

గత ఎన్నికల మేనిఫెస్టోలో అలవి కాని హామీలను ఇచ్చి మాట తప్పి మడమ తిప్పిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టి దేశంలోనే అబద్ధాల ముఖ్యమంత్రిగా జగన్ పేరుగాంచారని మండిపడ్డారు. పాదయాత్ర చేపట్టిన సమయంలో నవరత్నాలతో పాటు 730 హామీలను ఇచ్చిన జగన్ అధికారం చేపట్టిన తర్వాత వాటన్నింటినీ తుంగలో తొక్కి నవరత్నాల్లోని ఏడు హామీలనే అమలు చేసి పాక్షికంగా మరో 43 హామీలను నెరవేర్చి 83 శాతం హామీలను అటకెక్కించారని విమర్శించారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని చెప్పి తీరా ఎన్నికలయ్యాక వారికి పంగనామాలు పెట్టడంతో నేడు రోడ్లెక్కి నిరసన తెలుపుతున్నారని తెలిపారు. ఆఫ్‌షోర్, వంశధార వంటి ప్రాజెక్టులను పూర్తి చేస్తానని నమ్మబలికి గాలికొదిలేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ప్రజలను ఓట్లు అడుగుతాడని ప్రశ్నించారు. గతంలో లక్ష సంతకాల సేకరణ, రౌండ్‌టేబుల్ సమావేశాలు వంటి కార్యక్రమాలు చేపట్టి చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని నానా హంగామా చేసిన వారు నేడు ఎక్కడా కనబడడం లేదన్నారు. శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారి నిర్మాణానికి టిడిపి హయాంలో రూ.30 కోట్లను మంజూరు చేసి పనులను ప్రారంభిస్తే, వైసిపి ప్రభుత్వం నేటికీ పనులను పూర్తి చేయలేకపోయిందన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా కార్యదర్శి సనపల డిల్లేశ్వరరావు, బొడ్డేపల్లి గౌరీపతిరావు, అంబల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్



నేడు పోలీస్ స్పందన రద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా పోలీసు కార్యాలయం సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న వినతుల స్వీకరణ (స్పందన) కార్యక్రమాన్ని ఈనెల ఒకటో తేదీన రద్దు చేసినట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా స్పందన కార్యక్రమం నిర్వహించబడదని పేర్కొన్నారు.

ముందస్తు ప్రణాళికలతో 'ఉపాధి' పనుల గుర్తింపు

- క్షేత్రస్థాయిలో అంచనాలు తయారు
- గ్రామ పంచాయతీ యూనిట్‌గా పనులు
- డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు


ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనుల గుర్తింపునకు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు తెలిపారు. ఇప్పటికే ప్లానింగ్ ప్రక్రియను ప్రారంభించామన్నారు. పూడికతీత పనులతో పాటు కొత్తగా పనులు గుర్తించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జాబ్‌కార్డు ఉన్న ఉపాధి కూలీలందరికీ పనులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టి కూలీలకు పూర్తిస్థాయిలో డబ్బులను చెల్లించామన్నారు. పలు అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.

ఉపాధి పనుల్లో ఈ ఏడాది ఎలాంటి మార్పులు రానున్నాయి?

ఉపాధి హామీ పథకం అమల్లో శ్రీకాకుళం జిల్లా ఎల్లప్పుడూ ముందే ఉంటోంది. ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు పొట్ట చేత పట్టుకుని వెళ్లే కుటుంబాలకు స్థానికంగా ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యసాధనకు ఎప్పటికప్పుడు పథకాన్ని సమర్థవంతంగా జిల్లాలో పథకాన్ని అమలు చేయడం జరుగుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ఇంకా గడువున్నా, ముందస్తుగా వచ్చే ఏడాది చేపట్టబోయే పనులను గుర్తించే ప్రక్రియ మొదలు పెట్టడమైంది. 900కు పైగా గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో పనులు గుర్తిస్తున్నాం.





ఈ ఏడాది ఎంతమేరకు ఉపాధి లక్ష్యాలను అధిగమించగలిగారు?

జిల్లాలో సుమారు 6.50 లక్షల మందికి పైగా ఉపాధి హామీ కూలీలు ఉన్నారు. వారందరికీ పని కల్పించాలన్నదే లక్ష్యం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టి కూలీలకు పూర్తిస్థాయిలో కూలి మొత్తాలు చెల్లించాం. రోజుకు గరిష్ట కూలి రూ.272 పొందేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. ప్రణాళికకు అనుగుణంగా పనులు చేయకపోవడంతో గరిష్ట కూలి పొందడంలో కొంత వ్యత్యాసాలున్నాయి. అటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఈసారి పనులు గుర్తించడం, ఎక్కువ పనిదినాలు కల్పించి గరిష్ట కూలి అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

మెటీరియల్ కాంపోనెంట్ లక్ష్యం ఎంతమేరకు నెరవేర్చారు?

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు శాశ్వత ప్రాతిపదికన నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విడతల వారీగా ఈ భవన నిర్మాణాలు పూర్తి చేయడమవుతోంది. జగనన్న కాలనీల అభివృద్ధికి ఉపాధి పనులను అనుసంధానం చేయడం వల్ల మౌలిక వసతుల కల్పనకు ఉపకరిస్తున్నాయి. జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రైనేజి నిర్మాణం పనులు చేపట్టేందుకు వీలుంది. ఆ దిశగా ఉన్నత స్థాయిలో చర్చించి పనులు మంజూరు చేయడమవుతోంది. వీటితోపాటు గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, ఏరియా బల్క్ మిల్క్ యూనిట్లు నిర్మాణం, వాటికి అదనపు సౌకర్యాలు సమకూర్చుకునేందుకు వీలు కల్పిస్తున్నాం. పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయడం వల్ల అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.

మొక్కల సంరక్షణ చర్యలు చేపడుతున్నారా?

జిల్లాలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాం. ఈ ఏడాది కోటి మొక్కలు నాటేందుకు లక్షంగా నిర్ణయించాం. నాటిన ప్రతి మొక్క జీవించే విధంగా సంరక్షణ చర్యలు చేపడుతున్నాం. క్షేత్రస్థాయిలో వాటి సంరక్షణకు పర్యవేక్షణ చేపడుతున్నాం.


పింఛను ప్రొసీడింగ్స్‌ను అందజేస్తున్న మంత్రి అప్పలరాజు

అవ్వా తాతలకు రూ.3 వేలు పింఛను

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

అవ్వా, తాతలకు జనవరి నుంచి ప్రతినెలా రూ.3 వేలు పింఛను ప్రభుత్వం అందజేస్తుందని పశుసంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లలో వైఎస్ఆర్ పింఛను కానుక సంబర మహోత్సవ వేడుకల్లో ఆదివారం పాల్గొన్నారు. ఈ మేరకు పింఛన్ల ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి నెల నుంచి వైసిపి ప్రభుత్వం రూ.3 వేలు ఇస్తుందని అన్నారు. వృద్ధాప్యంలో చిన్న చిన్న ఆర్థిక అవసరాలు తీర్చడానికి డబ్బు అవసరమని, దానికి మనందరం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి అభినందనలు తెలియజేయాలని అన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో పింఛన్లు ఎప్పుడు ఇచ్చేవారో మనందరికీ తెలుసునని అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పైల చిట్టిబాబు, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, సర్పంచ్ బాడాన పుష్ప, ఎంపిటిసి రమణమ్మ, జెసిఎస్ కన్వీనర్ దువ్వాడ రవి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కొర్ల సంతోష్, వైస్ సర్పంచ్ పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

విలేకరికి పరామర్శ

కాశీబుగ్గకు చెందిన ఒక పత్రిక విలేకరి నల్లాన అశోక్ కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయాన్ని తెలుసుకుని మంత్రి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని, ఏమి అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. ఈయనతో పాటు ఎంపిపి ప్రతినిధి ఉంగ రామకృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరమణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ప్రజల చెంతకే పరిపాలన

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

ప్రజల చెంతకే పరిపాలనను తీసుకువచ్చిన ఏకైక సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలం కనిమెట్ట గ్రామంలో ఆదివారం నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అమల్లోకి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. అలాగే 99శాతం ఎన్నికల హామీలను అమలు చేసిన ఘనత సిఎంకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, సర్పంచ్ బి.లక్ష్మి, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎఎంసి చైర్మన్ సునీల్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె


ఆమదాలవలస : మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేస్తామని చెప్పి చర్చల పేరుతో తాత్సారం చేస్తున్నారని, చర్చలు విఫలం కావడంతో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి యన్.బలరాం డిమాండ్ చేశారు. పాదయాత్రలో అసెంబ్లీ సాక్షిగా జగన్ ఇచ్చినహామీలు అమలుకై నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా కార్మికులు విధులు బహిష్కరించి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా శిబిరంలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరిని పర్మినెంట్ చేసి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. జిఒ నెంబర్ ఏడు ప్రకారం క్లాప్ ఆటోలో డ్రైవర్లకు నెలకు రూ.18,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దుచేసి పాత ఫెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన పోరాటానికి ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళ్యాణ రాజు, అర్‌జి రాము, ఎ.రాజేష్, టి.వెంకటలక్ష్మి, టి.మల్లమ్మ, జె.మాధవి, ఎ.మోహన్, డి. యుగంధర్, ఎం.నారాయణరావు, డి .సురేష్ కుమార్, ఎం.అప్పన్న పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నిరవధిక సమ్మె చేపడుతున్న పారిశుద్ధ్య కార్మికులకు టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం హయాంలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ పథకాలను అందించడమే కాకుండా కనీస వేతనాలను ఇవ్వడం జరిగిందని, సిఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారన్నారు. పారిశుద్ధ్య కార్మికులు, అంగన్వాడీలు సమ్మెలు చేపడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఎండ అప్పలనాయుడు, పారిశుద్ధ్య కార్మిక నాయకుడు తాడి సంతోష్, శ్రీను, ఈశ్వరరావు, తారకేశ్వరరావు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : నోటికి రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

పలాస : సిఎం జగన్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, సిపిఐ నియోజకవర్గం నాయకులు చాపర వేణుగోపాల్, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మురగన్, ఎం.రవి, దివాకర్, ఎస్.శంకర్, తిరుపతి, ప్రకాష్‌ముఖి, సీతమ్మ, గులాబి, సావిత్రి, లక్ష్మి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని మౌన ప్రదర్శనతో వినూత్న నిరసన తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని సిఐటియు నాయకులు రమేష్ కుమార్ పట్నాయక్ స్పష్టం చేశారు.

అవినీతికి కేరాఫ్ మంత్రి సీదిరి

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- పలాస

అవినీతికి కేరాఫ్ పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆరోపించారు. పలాసలో టిడిపి ఆధ్వర్యాన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లొత్తూరు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డుకు చెందిన 125 కుటుంబాలు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష సమక్షంలో టిడిపిలోకి చేశారు. వీరికి ఎంపీ టిడిపి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాసలో కొండలు, గుట్టలు, భూములు సైతం మింగేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపడుతున్నా సిఎం జగన్‌కు చీమ కుట్టినట్లు లేదన్నారు. అందరి ఆకాంక్షలు నెరవేరాలంటే చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రి సీదిరి తట్టాబుట్టా పట్టుకొని పలాస నుంచి పారిపోయే పరిస్థితి వస్తుందని శిరీష పేర్కొన్నారు. 200 పడకల ఆస్పత్రి, కిడ్నీ పరిశోధన కేంద్రం నా తండ్రి శివాజీ హయాంలోనే మంజూరయ్యాయని తెలిపారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, మాజీ కౌన్సిలర్ సవర రాంబాబు, కొరికాన శంకర్, బి.నాగరాజు, మాజీ కౌన్సిలర్ కొవ్వూరు సురేష్, మల్లా శ్రీనివాసరావు, అంబటి కృష్ణమూర్తి, గోళ్ల చంద్రరావు, సప్ప నవీన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు


మహిళలతో మాట్లాడుతున్న లక్ష్మీదేవి

ఆదరించి అండగా నిలవాలి

శ్రీకాకుళం అర్బన్ : రాజకీయాలకు అతీతంగా కళింగ కోమట్లు ఎన్నోఏళ్లుగా తన కుటుంబానికి అండగా నిలుస్తున్నారని, నిస్వార్థంగా సేవలందిస్తున్న తన కుటుంబం ఎల్లప్పుడు రుణపడి ఉంటామని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. రానున్న రోజుల్లో అదే ఆదరణతో అండగా నిలవాలని ఆమె కోరారు. గార మండలం శ్రీకూర్మం సమీపాన నిర్వహించిన కళింగకోమట్ల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. సామాజిక పరంగా చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా ఎవరైనా తన సహకారాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోరాడ వెంకటరావు, జిల్లా ఎస్‌సిసెల్ ప్రధాన కార్యదర్శి గోర సురేష్, నాయకులు పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా సుపరిపాలన

ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి- పోలాకి

సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సుపరిపాలన అందించడం సాధ్యమవుతుందని వైసిపి అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పోలాకిలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ నూతన భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి సచివాలయం వ్యవస్థ అమలు చేయడంతో ప్రజలకు తమ గ్రామాల నుంచి సమస్యలు పరిష్కారమవుతుందని అన్నారు. సంక్షేమ, పాలన అభివృద్ధి చూడలేని ప్రతిపక్ష నాయకులు సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని వైసిపి కార్యకర్తలు తిప్పికొట్టాలని సూచించారు. గ్రామస్థాయిలో అనేక భవనాలు, నాడు-నేడు ద్వారా పాఠశాలల భవనాలు నిర్మాణాలు అభివృద్ధి కాదా? అని ప్రశ్నించారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డిసిసిబి అధ్యక్షులు కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ మజ్జి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

'ప్రజాశక్తి' కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కవిటి

కవిటి, ఇచ్ఛాపురం మండలాల ప్రజాశక్తి కేలండర్ల ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా చెబుతూ, నిత్యం ప్రజా సమస్యలు వెలుగులోకి తెచ్చే పత్రిక ప్రజాశక్తి అని కొనియాడారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న శిరీష, శివాజీ

నర్సింహమూర్తి మృతి టిడిపికి లోటు

ప్రజాశక్తి- పలాస

కుత్తుం నర్సింహమూర్తి మృతి టిడిపికి తీరని లోటని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. మండలంలోని గురుదాసుపురంలో కుత్తుం నర్సింహమూర్తి సంతాపసభ ఆదివారం నిర్వహించారు. ముందుగా నర్సింహమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, కుత్తుం రూపవతి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, దువ్వాడ సంతోష్‌కుమార్, మల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.


డాన్స్ చేస్తున్న యువకులు

తీర ప్రాంతంలో సందడే సందడి

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలంలోని తీరప్రాంత గ్రామాలైన భావనపాడు, మేఘవరం, సున్నాపల్లి ప్రాంతాల్లో నూతన సంవత్సర వేడుకలు ఆదివారమే మొదలయ్యాయి. ఏడాది చివర రోజు కావడంతో భావనపాడు తీరంలో సందడి నెలకొంది. పలువురు యువకులు కేక్ కటింట్లు, డిజె సౌండ్స్‌తో ఉల్లాసంగా గడిపారు. విహార యాత్రికులు, యువత, మహిళలు కేరింతలతో తీర ప్రాంతం కిటకిటలాడింది. అధిక సంఖ్యలో వచ్చిన పర్యటకులు తోటల్లో సేదతీరి, సముద్ర స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. వయసుతో సంబంధం లేకుండా ఆటలతో, పాటలతో కేరింతల కొడుతూ ఉల్లాసంగా గడిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నౌపడ పోలీసులు, భావనపాడు మెరైన్ పోలీసులు సంయుక్తంగా పహరా కాశారు. ప్రమాద హెచ్చరికలు సూచిస్తూ... అవగాహన కల్పించారు.


అవార్డు అందుకుంటున్న హనీషాగాంధీ

హనీషాగాంధీ ప్రతిభ

టెక్కలి : సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో కొంచాడ హనీషాగాంధీ పాల్గొన్నారు. ఈ మేరకు రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో విజేతగా నిలిచారు. దీంతో ఆదివారం ఆమెకు స్థానిక సత్యసాయి సేవా సమితి నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో హనీషాగాంధీకి ధ్రువపత్రం, మెమోంట్, రూ.పది వేలు నగదు పారితోషకాన్ని జిల్లా అధ్యక్షులు ఎన్ని లింగరాజు అందజేశారు. రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో చదువుతున్న హనీషాగాంధీ రాష్ట్రస్థాయి ప్రతిభ కనబరచడంపై ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతీచౌదరి, తాలాసు శ్రీను, మల్లా శరత్‌బాబు, భైరాగి అభినందించారు.

ధర్నాను విజయవంతం చేయాలి

టెక్కలి : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 3న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా సహధ్యక్షులు కురమాన దాలయ్య ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఉద్యోగులు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని కోరారు.


మురళీకృష్ణ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

మురళీకృష్ణ సేవలు మరువలేనివి

పొందూరు: మండల పరిపాలన అధికారిగా మురళీకృష్ణ అందించిన సేవలు మరువలేనివని ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎఒ వడగ మురళీకృష్ణ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ అభినందన సభలో మురళీకృష్ణ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను పలువురు కొనియాడారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడానికి తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ పివి.రామరాజు, డిపిఆర్‌సి కో-ఆర్డినేటర్ రాజు, ఇఒపిఆర్‌డి సింహాచలం, మండల ఇంజనీరింగ్ అధికారి గుప్తా, ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఆక్వా'లో యాజమాన్య పద్ధతులపై శిక్షణ


ధ్రువపత్రాలతో ఆక్వా రైతులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ఆక్వా కల్చర్‌లో యాజమాన్య పద్ధతులు పాటించాలని వెంపాడ ఎడి ప్రసాద్ నాయక్, నాస్కా చీఫ సెక్రటరీ బాలాజీ అన్నారు. మండలంలోని ఆకాశలాఖవరం పంచాయతీలో కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుగ్గు పుణ్యవతి అధ్యక్షతన ఆక్వా కల్చర్ మంచి యాజమాన్య పద్ధతులు, విభిన్న జాతుల పెంపకంపై ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులకు తక్కువ పెట్టుబడి పెడుతూ మంచి పంటలకు రసాయనాలు ఎలా ఉపయోగించాలో తగు జాగ్రత్తల గురించి వివరించారు. దగ్గరలో ఉన్న ఆక్వా పరీక్షా కేంద్రాల్లో వారానికొకసారి పరీక్షలు చేసి సరైన పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని పేర్కొన్నారు. అనంతరం ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టెక్కలి ఎఫ్‌డిఒ ధర్మరాజుపాత్రో, ఫీల్డ్‌మేన్ సునీల్, సర్పంచ్ సుగ్గు ఎండయ్య పాల్గొన్నారు.

క్రీడాకారునికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : స్కూల్ గేమ్ ఫెడరేషన్ స్విమ్మింగ్ జాతీయ స్థాయికి ఇచ్ఛాపురం జూనియర్ కాలేజీకి చెందిన గోవింద్ బెహరా ఎంపిక య్యారు. ఈ నెల 3 నుంచి ఢిల్లీలో నిర్వహించనున్న పోటీలో పాల్గొంటారు. పోటీలకు వెళ్లేందుకు ఆర్థికస్తోమత లేకపోవడంతో వైసిపి కన్వీనర్ దక్కత జయప్రకాష్‌రెడ్డి ఆదివారం రూ.6 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పి.ఎంజులతరెడ్డి, పి.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న జయప్రకాష్‌రెడ్డి

అంబేద్కర్ ఆశయాలు కొనసాగిద్దాం


మాట్లాడుతున్న మోహనరావు

ప్రజాశక్తి- సోంపేట

అంబేద్కర్ సమాజానికి చూపిన దారిలో నడుద్దాం అంటూ జైభీమ్ సేన జిల్లా అధ్యక్షుడు నగిరి మోహనరావు అన్నారు. సోంపేటలోని జైభీమ్ సేన గ్రంథాలయం వద్ద సంస్థ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములమవుతామని అన్నారు. ప్రతిఒక్కరూ ఆయన చూపిన బాటలో నడవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఇప్పిలి ధర్మారావు, డోప్ప వెంకటరావు, జి.ప్రకాశరావు, రవిసిద్ధార్థ, ఎన్.ఎ.డి.పాత్రో, మగ్రిపాటి పూర్ణచంద్ర పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

పలాస: పలాసలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మదర్ థెరీసా పాఠశాల చైర్మన్ వజ్జ బాబూరావు స్వగృహంలో ఆయన తండ్రి వజ్జ సూర్యనారాయణ వర్థంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ముందుగా సూర్యనారాయణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, సిబ్బందికి బాబూరావు, పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగాభవాని చీరలు, దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వజ్జ రాంబాబు, వజ్జ కాత్యాయని, సనపల శివ రామకృష్ణ, వజ్జ అవినాష్, వజ్జ అనూష, కౌన్సిలర్ డిక్కల ఆనందరావు, బి.కృష్ణారావు, వనజాక్షి, పాఠశాల ఇన్‌ఛార్జి ఆర్.ప్రసాదరావు, ఉపాధ్యాయులు జోగారావు కూర్మారావు, చిరంజీవి, లక్ష్మణరావు పాల్గొన్నారు.


పలాస : చీరలను పంపిణీ చేస్తున్న గంగాభవాని

పోలాకి : రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన మండలంలోని గంటపేటకు చెందిన ఏదూరి శ్రీనివాస్‌రెడ్డి, కూటికుప్పల సురేష్ కుమార్ సౌజన్యంతో వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యరకమంలో సంతబొమ్మాళి జెడ్‌పిటిసి సభ్యులు పాల వసంతరెడ్డి పాల్గొన్నారు.


పోలాకి : దుస్తులను పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి


సంఘీభావంగా శిబిరంలో కూర్చున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉపాధ్యాయ సంఘాల మద్దతు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమగ్ర శిక్ష, విద్యాశాఖల పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవదిక సమ్మెలో భాగంగా జ్యోతిరావుపూలే పార్కు వద్ద ధర్నా శిబిరాన్ని ఆదివారం కొనసాగించారు. ఈ శిబిరాన్ని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఎపిటిఎఫ్-1938 జిల్లా అధ్యక్షులు కామేశ్వరరావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అరకొర వేతనాలతో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని తక్షణమే ఉద్యోగభద్రత కల్పించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె కారణంగా సమగ్ర శిక్ష సేవలు అరకొరగా అందుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం అన్యాయమన్నారు. ఎపిటిఎఫ్ -257 సంఘం రాష్ట్ర కౌన్సిలర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగుల న్యాయసమ్మతమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించి, సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పేడాడ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సమ్మెకు దారితీసిందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ఆమదాలవలస మండల ప్రధాన కార్యదర్శి టి.పారారావు, విశ్రాంత ఉపాధ్యాయులు రమణ, తిరుమలరావు, ఎపిటిఎఫ్ జిల్లా కార్యవర్గం అనిల్‌బాబు, బొడ్డేపల్లి మహేష్, సుందరరావు, రాజేశ్వరరావు, అయ్యప్ప మధుసూదనరావు, చినబాబు, చంద్రశేఖర్, అమ్మి నాయుడు, రమేష్ గౌరీశ్వరరావు, సుధాకర్, అప్పారావు నాయుడు మాట్లాడారు. శిబిరంలో సమగ్ర శిక్షా శ్రీకాకుళం జెఎసి అధ్యక్షులు పైడి మురళీకృష్ణ, జెఎసి ప్రధాన కార్యదర్శి తవిటినాయుడు, శ్రీనివాసరావు శివ, అరుంధతి, విమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- కవిటి

రాబోయే ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే సీటు తమకు కేటాయించాలని, లేదంటే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి తమ సత్తా చూపిస్తామని నియోజకవర్గంలోని ఒడియా మైనారిటీలు అధికార పార్టీ వైసిపికి అల్టిమేటం జారీ చేశారు. ఈ మేరకు మండలంలోని వింధ్యగిరి కురారి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఆదివారం ఒడియా మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎపి ఒడియా మైనార్టీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాఢీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒడిఢి రాష్ట్రం బరంపురం ఎంపి చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ కుమార్ పండా మాట్లాడుతూ నియోజవర్గంలో అధిక శాతం ప్రజలు ఉన్న ఒడియా మైనార్టీలకు ఇప్పటి వరకూ ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వలేదని అన్నారు. నియోజకవర్గంలో 80 వేల ఓటర్లు ఉన్న ఒడియా ప్రజలకు ప్రతినిధిగా ఒడియా మైనార్టీలకు ఎమ్మెల్యే సీటు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఒడియా మైనారిటీల ప్రతినిధులు దేవరాజ్ సాహు, పాండవ చంద్రశేఖర్, శివ బిసాయి, కుమార్ నాయక్, పంచానన రౌళొ, కృష్ణ రౌళొ, రవి ప్రధాన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు

రేపు అవగాహనా సదస్సు

టెక్కలి : టెక్కలి నియోజకవర్గం పరిధిలోని విశ్రాంత ఉద్యోగులకు ఆవసరమైన వివిధ రకాల ధ్రువపత్రాల మంజూరుకు, అవసరమైన అంశాలు వివరించేందుకు ఈ నెల 2న అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నామని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో లైఫ్ ధ్రువపత్రాలు మంజూరు చేసే విధానం, సిఎఫ్ఎంఎస్‌లో లాగిన్ అయ్యే విధానం, ఇఫైలింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామని అన్నారు. సదస్సుకు ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, టెక్కలి డివిజన్ ఖజానాశాఖాధికారులు పాల్గొంటారని తెలిపారు.

నాటుసారా స్వాధీనం

మెళియాపుట్టి : మండలంలో రట్టినిలో పాతపట్నం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నారు. అక్రమంగా నాటుసారా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తరచూ దాడులు చేపడతామని తెలిపారు.


పరిశీలిస్తున్న పోలీసులు

గొప్పిలిలో చోరీ

మెళియాపుట్టి : మండలంలో గొప్పిలిలో కోట్నీ సోమేశ్వరరావు ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడి ఎనిమిదిన్నర తులాల బంగారం దొంగలించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తన కుమార్తె హైదరాబాద్‌లో ఉన్న ఇంటికి వెళ్లి పది రోజుల శనివారం వచ్చి చూడగా తాళం విరగొట్టి ఉంది. ఇంట్లో వెళ్లి చూడగా బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.రాజేష్ ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీతి పద్యాలు, కథలు నేర్చుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పాఠశాల విద్యాభ్యాసంలోనే పిల్లలకు నీతి పద్యాలు, కథలు నేర్పాల్సిన అవసరం ఉందని బలగ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు ఉప్పు త్రినాధరావు అన్నారు. ఆదివారం బలగ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యాన చదవటం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో, పాఠశాలల్లో నీతికథలు, పద్యాలు బోధించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విద్యార్థి తెలుగును తప్పనిసరిగా నేర్చుకొని తెలుగుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.


లావేరు : విద్యార్థులకు వివరిస్తున్న గాయత్రి

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికారు. అలాగే 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరుగుతుందని, దీనిని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. మహాభారతంలో ఘటోత్కచుడు పాత్రపై కె.గాయత్రి విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయం తరుపున గ్రంథాలయాధికారి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


బలగ : మాట్లాడుతున్న త్రినాథరావు



మాట్లాడుతున్న వెంకటరమణ

గ్రామ సమస్యలపై పోరాటం

కొత్తూరు : గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై టిడిపి కార్యకర్తలు పోరాటం చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పిలుపునిచ్చారు. స్థానిక కలమట కాంప్లెక్స్ వద్ద మండలంలోని కర్లెమ్మ, ఎల్ఎన్‌పేట మండలం చిన్నకొల్లివలస ఆర్అండ్ఆర్ కాలనీల టిడిపి నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆగతముడి అరుణ్‌కుమార్, ఎల్లి అచ్యుతరావు, లోతుగెడ్డ భగవాన్‌నాయుడు, మడపాన రాజారావు, ఎద్దు శ్రీనునాయుడు, తొంపల తిరుపతిరావు, పెద్దిన అమర్, మణికంఠ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎర్రయ్యరెడ్డి

మా పొట్ట కొట్టొద్దు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటే... ఆటో కార్మికులు రోడ్డున పడతారని ఆటో యూనియన్ నాయకులు ఎర్రయ్యరెడ్డి, మోహనరావు అన్నారు. పట్టణంలోని సురంగి రాజా క్రీడా మైదానంలో ఆదివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే పక్క రాష్ట్రంలో ఉచితంగా మహిళలకు బస్సు ప్రయాణం అమలు చేయడం వల్ల ఆటో కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతం పెరగడంతో ఒక వైపు ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అంతంత మాత్రమే ఉన్న ఆటో కార్మికులు జీవనోపాధికి ఉచిత బస్సు సౌకర్యం మరింత కృంగదీస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల ఆటో యూనియన్ నాయకులు గోపాల్‌రెడ్డి, రామారావు, శంకర్, బాలయ్య, బొర చిన్నారెడ్డి, మధు, చంద్రయ్య, పాండవ చంద్రశేఖర్, బడే సాయి, శాంతిమూర్తి పాల్గొన్నారు.



బియ్యం అందజేస్తున్న విద్యార్థులు

ఎస్‌విజె విద్యార్థుల ఔదార్యం

ప్రజాశక్తి- కవిటి

అన్నార్తులు, అభాగ్యులకు అండగా నిలవాలనే గురువుల ఆదేశాలను ఆ విద్యార్థులు తు.చ తప్పక పాటించారు. కవిటి ఎస్‌విజె సంస్థల విద్యార్థులు సీతయ్య ఫౌండేషన్‌లో తలదాచకుంటున్న వయో వృద్ధులకు, అభాగ్యులకు బియ్యం సేకరించారు. సేకరించిన 70 కేజీల బియ్యం ఆదివారం సీతయ్య ఫౌండేషన్ నిర్వాహకులకు అందజేశారు. ఆర్తులకు అండగా నిలిచిన ఎస్‌విజె విద్యార్థులను కరస్పాండెంట్ బెందాలం కింగ్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

యువ రైతులకు శిక్షణ



పుట్టగొడుగుల పెంపకంపై రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగుల పెంపకంపై యువ రైతులకు శిక్షణను ఇవ్వనున్నట్లు కెవికె ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఆదివారం కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి వచ్చే నెల 5 వరకు ఈ శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.రామచంద్రరావు, ప్రాంతీయ పరిశోధనా స్థానం అనకాపల్లి ఎడిఆర్ డాక్టర్ పివికె జగన్నాథరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ యువత స్వయంఉపాధి కొరకు పుట్టగొడుగుల పెంపకం శిక్షణా కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. అనంతరం కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష మాట్లాడుతూ గ్రామీణ యువతకు పుట్టగొడుగుల పెంపకంలో ఉన్న అన్ని మెలకువలను వారం రోజులు అనుభవజ్ఞులైన అధ్యాపకులు, శాస్త్రవేత్తలచే తరగతులు చెప్పించి, కృషివిజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగులను పెట్టించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కెవికె సిబ్బంది, యువ రైతులు పాల్గొన్నారు.

కక్క లేక.. మింగలేక..!

కోటబొమ్మాళి: ఆడుదాం ఆంధ్రాకు సంబంధించిన సేవలు అందించడం తమకు అదనపు భారంగా పరిణమించిందని..ఫలితంగా తీవ్ర ఒత్తిడికి గురవు తున్నామని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. కీలక భూమిక వహించాల్సిన పిఇటిలు అతిథులుగా వ్యవహరించి సంబంధిత బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. అన్నింటా వాలంటీర్ల సేవలు విరివిగా అందుతున్నాయన్న భ్రమలో వున్న ప్రభుత్వపెద్దలు, అధికార యంత్రాంగం సచివాలయ ఉద్యోగులపై పరోక్షంగా ఒత్తిడి పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల మేరకు ఆటలాడించి.. విధానపరంగా స్కోర్లు వేయించాల్సిన పిఇటిలు ఆ వ్యవహారాల్లో తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడాన్ని సచివాలయ ఉద్యోగులు (ముఖ్యంగా ఆడుదాం ఆంధ్ర బాధ్యతలు నిర్వర్తిస్తున్నవారు) జీర్ణించుకోలేక పోతున్నారు. దీంతో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఏదోలా మమ అనిపించేయడం సచివాలయ ఉద్యోగులకు అనివార్యమైందని పరిస్థితులు చెబుతున్నాయి. ఆటలాడించడం ఒక ఎత్తైయితే స్కోర్లు వేయడం. అప్లోడ్ చేయించడం వంటివి మరో ఎత్తుని బాధ్యతలతో సతమత మవుతున్న వారు విసుక్కుంటున్నారు. పిఈటీలకు పూర్తి బాధ్యతలు అప్పజెప్పాలన్న స్పృహలో అధికార యంత్రాంగం లేకపోవడాన్ని తప్పుపడుతున్నారు. అదిలా వుంచితే వాలంటీర్లు ప్రతినిత్యం సచివాలయాల వద్ద అందుబాటులో వుంటారన్న చందంగా మండలస్థాయి అధికారులు మొదలుకొని ముఖ్యమంత్రి వరకు వాలంటీర్ల సేవలపై అతిగా ఊహించుకుంటున్న పరిస్థితిపై సచివాలయ ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అయితే తమ వేదన మండలస్థాయి ఉన్నతాధికారులకు పంచుకోలేక జిల్లాస్థాయిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయలేక అంటే కక్కలేక మింగలేక.. కాలాన్ని వెల్లబుచ్చుతున్నట్లు పరిస్థితులు చాటిచెబుతున్నాయి. ముఖ్యంగా వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసి ఎవరికి ఏ పని అప్పజెప్పాలో గ్రహించి ఆమేరకు కార్యక్రమాలను ముందుకు నడిపించి విజయవంతం చేయాలని పలువురు సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

ప్రజాశక్తి- పలాస

క్రీడాకారులు ఎక్కడ పోటీలు నిర్వహించినా విధిగా పాల్గొనడం ద్వారా వారి ప్రతిభ వెలికితీస్తుందని బాడీకేర్ ఫిట్నెస్ జిమ్ కోచ్ నెయ్యిల భాస్కర్ అన్నారు. కాశీబుగ్గలో బాడీ కేర్ ఫిట్నెస్ జిమ్ ఆధ్వర్యాన ఆదివారం పవర్ లిఫ్టింగ్ పోటీలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనడం ద్వారా మెలుకువలు తెలుస్తాయని అన్నారు. మెట్టుకుమెట్టు ఉన్నత స్థానంలో నిలిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. 70 మంది పాల్గొన్న మూడు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో 9 మంది గెలుపొందారు. ఈ పోటీలో ఎన్.సాయి, ఎం.హనీస్‌రెడ్డి ఛాంపియన్స్‌గా నిలిచారు. వీరిని జిమ్ యాజమాన్యం, కోచ్, స్పన్సెర్స్ ట్రోఫీలను, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో జోగారావు, సాయి, అల్లు రమణ, వేణు, మల్లి, రాకేష్, విక్కీ, సోము, గౌతం, వంశీ, నాని పాల్గొన్నారు.

అశోక్‌కుమార్ పాదయాత్రకు స్వాగతం

పలాస: నెల్లూరు గ్రామీణ నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులు టిడిపి పూర్వ పూర్వ వైభవానికి చింతల అశోక్‌కుమార్ చేపడుతున్న పాదయాత్రకు స్థానిక నాయకులు పలాసలో స్వాగతం పలికారు. ఆయన ఇచ్ఛాపురం నుంచి చేపట్టిన పాదయాత్ర ఆదివారం పలాసకు చేరుకుంది. జాతీయ రహదారి రంగోయి కూడలి నుంచి లక్ష్మీపురం టోల్‌గేట్ వరకు ఆయనతో పాటు టిడిపి నాయకులు పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి పీరికట్ల విఠల్‌రావు, పట్టణ టిడిపి అధ్యక్షులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, కౌన్సిలర్ ప్రతినిధి జోగ మల్లేశ్వరరావు, బర్ల కృష్ణారావు, బల్ల కృష్ణకుమార్, కొత్త సత్యం, కుమ్మరి శివాజీ పాల్గొన్నారు.



జ్ఞాపికను స్వీకరిస్తున్న జడ్జి శివకిరణ్

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం అనకాపల్లి జిల్లా న్యాయమూర్తి శివకిరణ్ సతీసమేతంగా సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల అనంతరం అనివేటి మండపంలో వారికి శేష వస్త్రాలను కప్పి జ్ఞాపికను అందజేశారు. ఆయన వెంట ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

తగ్గిన ఆదాయం

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయానికి యాత్రికుల తాకిడి కొంత మేరకు తగ్గింది. దీంతో ఆదాయం తగ్గినట్టు ఇఒ విహరి సూర్యప్రకాష్ తెలిపారు. టికెట్లు రూపంలో రూ.66,500, విరాళాల రూపంలో రూ.45,872, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,25,275 ఆదాయం సమకూరినట్టు తెలిపారు.

ప్రజల హక్కులు కాలరాస్తున్న పాలకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న చంద్రశేఖర్

దేశంలో హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతోందని, పాలకులే ప్రజల హక్కులను కాలరాస్తూ మాట్లాడే స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ నియంతృత్వపు పోకడలను అమలు చేస్తున్నారని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలక చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం నగరంలో బాపూజీ కళామందిర్‌లో పౌరహక్కుల సంఘం 17వ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈసభలకు జిల్లా అధ్యక్షులు పత్రి దానేష్ అధ్యక్షత వహించారు. మహా సభలకు రాష్ట్ర అధ్యక్షులు చిట్టిబాబు, కార్యదర్శి చంద్రశేఖర్‌లు హాజరై మాట్లాడుతూ పౌర హక్కుల సంఘం విప్లవ సంస్థ పక్షాన పని చేసుందన్న వాదన సరికాదన్నారు. ప్రజలకు ఎప్పుడు కష్టం వచ్చినా, హక్కుల ఉల్లంఘన ఎక్కడ జరిగినా పౌరహక్కుల సంఘం తప్పక న్యాయం పక్షాన నిలిచి ప్రశ్నిస్తుందన్నారు. దేశంలో రాజ్యాంగ బద్దంగా సంక్రమించిన హక్కులను పేదవర్గాలకు సైతం వర్తింప జేయాలన్నారు. చట్టం పెత్తందార్ల అనుకూల వర్గాలుగా మారుతున్నాయన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిలారి ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి వెంకటరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

టెక్కలి : ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను మెగా డిఎస్‌సి ద్వారా మంజూరు చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మెజ్జాడ యుగంధర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గడచిన నాలుగున్నరేళ్లలో ఒక్క డిఎస్‌సి కూడా నిర్వహించలేదని అన్నారు. ఎందరో నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు.



జాగిలంతో సోదాలు నిర్వహిస్తున్న ఎస్ఇబి అధికారులు

పోలీసుల ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

గంజాయి అక్రమ రవాణాపై శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌లో పోలీసు జాగిలంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. ఆదివారం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం, పార్సిల్ భవనంలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణాపై తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో అనుమానాస్పద లగేజీలను పరిశీలించామని, ఎటువంటి మత్తు పదార్థాలు దొరకలేదని తెలిపారు. ఈ సోదాల్లో ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు.



సరుకులను అందజేస్తున్న సభ్యులు

అగ్ని ప్రమాద బాధితునికి చేయూత

పలాస : పలాస కోసంగిపురం కూడలి జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న సతివాడ భారతి ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇటీవల దగ్ధమైంది. విషయం తెలుసుకున్న గ్రీన్ ఆర్మీ సభ్యులు అగ్ని బాధితులకు ఆదివారం ఓదార్చి ఇంటికి సరిపడే నిత్యావసర సరుకులు, ఆర్థికసాయం అందజేశారు. వీరికి ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, బి.ఓంకార్, రోణంకి శాంతికుమారి, వైకుంఠరావు, కిషోర్ కుమార్, రోణంకి వెంకటరమణ, దాసరి శ్రీనివాసరావు, నీలాపు ఉపేంద్ర పాల్గొన్నారు.

వైసిపితో అభివృద్ధి శూన్యం

కోటబొమ్మాళి: వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. టెక్కలి నియోజకవర్గం టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సారథ్యంలో టిడిపి బలోపేతంగా ఉందని అన్నారు. టిడిపి గెలుస్తుందని భయంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో దాదాపు 70 మందికి పైగా ఎమ్మెల్యే స్థానాలను మారుస్తున్నారని వ్యాఖ్యానించారు. అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడులు టెక్కలి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి చేపట్టారని గుర్తు చేశారు.

ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృషి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం



ఇచ్ఛాపురం : పార్టీ కండువా వేస్తున్న రాజు

రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా జనసేన టిడిపితో పొత్తు పెట్టుకుందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు అన్నారు. మండలంలో ఈదుపురం పంచాయతీలో బాసి భారతిరెడ్డి, సంజయ్ రౌలో, చిట్టు బెహరా, జనసైనికులు సహాయంతో నిర్మించిన జనసేన జెండా స్తూపం వద్ద ఆదివారం ఆవిష్కరించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రెటరీలు తిప్పన దుర్యోధనరెడ్డి, బైపల్లి ఈశ్వరరావు, మత్స్యకార వికాస విభాగ రాష్ట్ర కార్యదర్శి నాగుల హరిబెహరా, దుర్గాసి నీలవేణిరెడ్డి, డొక్కరి ఈశ్వరరావు, దుగాన దివాకర్ పాల్గొన్నారు.



మెళియాపుట్టి : ఛాయ్ విత్ చైతన్య కార్యక్రమంలో జనసేన నాయకులు

మెళియాపుట్టి : వచ్చే ఎన్నికల్లో జనసేన, టిడిపి ఉమ్మడిగా ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధం కావాలని జనసేన మండల నాయకులు దుక్క బాలరాజు పిలుపునిచ్చారు. మండలంలోని వసుంధరలో ఛాయ్ విత్ చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పత్రి మణికంఠ, పిట్ట హరికృష్ణ పాల్గొన్నారు.

కిడ్నీ ఆస్పత్రిలో సిబ్బందిని నియమించాలి

ప్రజాశక్తి- పలాస

పలాసలో ప్రారంభించిన 200 పడకల, కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రుల్లో ఫార్మాసిస్టు సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్టు గ్రేడ్–1, 2,3 పోస్టులను తక్షణమే మంజూరు చేసి భర్తీ చేయాలని ఫార్మాసిస్టు అసోసియేషన్, పలాస ఎపిఎన్‌జిఒ అధ్యక్షులు బోనేల గోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మంత్రి కార్యాలయంలో పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో భాగంగా కడప సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మంజూరు చేసిన విధంగా ఆయా పోస్టులను మంజూరు చేసి భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



మంత్రికి వివరిస్తున్న గోపాల్